## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి


షేక్ జుబేర్

బాన్సువాడ, మే 31 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 2వ తేదీన ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో జాతీయపతాకం, బీఆర్ఎస్ పార్టీ జెండాలను పార్టీ నాయకులు ఎగురవేయాలని సూచించారు. జాతీయ గీతం అలాపించి, అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయాన్ని అలాపించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పండుగ వాతావరణంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించాలని అన్నారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 8 గంటలకు జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని, పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

## ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన ట్రస్మా కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి, మే 31 : తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) జిల్లా కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పున్న రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా వీరాచారిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ కడారి అనంతరెడ్డి, చింతల రాంచందర్, పట్టణంలోని పాఠశాలల ప్రిన్సిపాళ్లు గోవర్ధన్‌రెడ్డి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

**ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం..**

రామారెడ్డి, మే 31 : గాంధారి మండల కేంద్రంలో జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు తూర్పురాజులు, మండల అధ్యక్షుడు రెడ్డిరాజులు ఆధ్వర్యంలో ముదిరాజ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గాంధారి అధ్యక్షుడిగా కామెల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా రెడ్డి శివయ్య, ప్రధాన కార్యదర్శిగా తూర్పు రాజశేఖర్, కోశాధికారిగా తూర్పు సంతోష్, సంఘ సభ్యులుగా వెంకటరాజు, సాయిరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు పుష్కరిణిలో పడి వ్యక్తి మృతి

రామారెడ్డి, మే 31 : మండలంలోని మద్దికుంట శివారులో ఉన్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని పుష్కరిణిలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందినట్లు రామారెడ్డి ప్రొబేషనరీ ఎస్సై నవీన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాకలి ఓరుగంటి గంగయ్య(50) ఒంటరిగా జీవిస్తున్నాడు. వృద్ధాప్యం కారణంగా ఇటీవలే కుటుంబ సభ్యులు మద్దికుంట ఆలయప్రాగణంలో ఉన్న వృద్ధాశ్రమానికి తరలించారు. శనివారం స్నానం చేయడానికి ఆలయ పుష్కరిణిలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగి మృతి చెందాడు. తల్లి బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారని ఎస్సై తెలిపారు.

# ధూమపానానికి దూరంగా ఉండాలి


కామారెడ్డి జిల్లా కోర్టులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


తాడ్కోల్‌లో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

కామారెడ్డి, మే 31 : జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టులో, జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ సిబ్బంది శనివారం అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని అన్నారు. పొగాకుతో కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన పరిపాలన అధికారి లక్ష్మీకాంత్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, జిల్లా కోర్టు సూపరింటెండెంట్ కరుణశ్రీ, జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, న్యాయవాది వేణుప్రసాద్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

**పొగాకుతో ఏటా లక్షల మంది మృత్యువాత**

బాన్సువాడ రూరల్/ఎల్లారెడ్డి రూరల్/బిచ్కుంద, మే 31 : పొగాకుకు అలవాటు పడి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 13 లక్షల మంది మరణిస్తున్నారని, ప్రజలు పొగాకు నుంచి దూరంగా ఉండాలని బాన్సువాడ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో మండల న్యాయ సేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిగరెట్టు, బీడీలు, చుట్టలు తాగడంతో పొగాకులోని నికోటిన్ అనే పదార్థం శరీరంలోనే అనేక అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. గుండె జబ్బులు, ఊపిరితిత్తులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. యువకులు పొగాకు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూషణ్‌రెడ్డి, ఖలీల్, కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్లు పుష్పవతి, అయ్యాల సంతోష్, హైమద్ హుస్సేన్, రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో కలిసి వైద్యుడు శరత్‌కుమార్ ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించారు. మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులున్నారు. బిచ్కుందలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని నివారించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వినీల్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు.

## సమస్యల పరిష్కారానికే మీడియేషన్ సెంటర్

బాన్సువాడ, మే 31 : కుటుంబాల్లో వచ్చే చిన్న చిన్న సమస్యల పరిష్కారానికే కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సభ్యులు పనిచేస్తారని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లు పనిచేస్తాయని మీడియేషన్ సభ్యులు పుష్పలత, రామకృష్ణారెడ్డి అన్నారు. కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌లో శనివారం పలు కుటుంబ సభ్యుల మధ్యన నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. మున్సిపాలిటీలో రెండు నెలల క్రితం ప్రారంభమైన ఈ సెంటర్ ఇప్పటి వరకు 16 కేసులు తమ దృష్టికి వచ్చాయన్నారు. వాటిలో ఇప్పటి వరకు 12 కేసులను పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని వివరించారు.

## రేపు ప్రజావాణి వాయిదా

కామారెడ్డి, మే 31 : ఈ నెల 2వ తేదీన నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని రూం నంబర్ 25లో ఎవరైనా దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. 9న ప్రజావాణి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

## ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కామారెడ్డి, మే 31 : ఉద్యోగ విరమణ పొందిన పలువురు సిబ్బందిని పోలీస్ అధికారులు శనివారం సన్మానించారు. జిల్లా పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నర్సింహులు, ఏఆర్ఎస్ఐ నీలంరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చంద్రప్రకాశ్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలన్నారు. రిటైర్మెంట్ అనంతరం అందాల్సిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జార్జ్, తిరుపతయ్య, శ్రీధర్, శ్రీనివాసులు, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ, సంతోష్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఎస్సైలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అహల్యబాయి హోల్కర్ జయంతి


తడిహిప్పర్గ గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మద్నూర్, మే 31 : మండలంలోని పలు గ్రామాల్లో అహల్యబాయి హెల్కర్ జయంతిని ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, జెండా ఎగురవేశారు. మండలంలోని తడిహిప్పర్గ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటీల్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, గంగారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్మంత్ షిండే మాట్లాడుతూ.. సమాజానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బాన్సువాడ, మే 31 : పండుగలను కుల, మతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి సూచించారు. డీఎస్పీ కార్యాలయంలో బక్రీద్ పండుగ సందర్భంగా ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కలిసి శాంతి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయా పార్టీ నాయకులు డీఎస్పీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు ఖాలేక్, వాహబ్, ఎజాజ్, అలీ బిన్ అబ్దుల్లా, నార్లసురేశ్ గుప్తా, శంకర్ గౌడ్, సాయిలు ఉన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న స్థానిక నాయకులు

బాన్సువాడ, మే 31 : పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మున్నూరు కాపు పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన వంద మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ డివిజన్‌లోని మున్నూరు కాపు సంఘం ప్రతినిధులతో కలిసి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెట్టిగాడి అంజయ్య, కోశాధికారి ఆంజనేయులు, డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, డాక్టర్ తోట కిరణ్ కుమార్, ప్రదీప్ పటేల్, కొట్టం గంగాధర్, బిట్ల సురేందర్, గుడాల నాగేశ్, మంద ప్రవీణ్‌కుమార్, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు


సదాశివనగర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

రామారెడ్డి (సదాశివనగర్), మే 31 : సదాశివనగర్‌లోని రెండు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రజాప్రతి, సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రంజిత్ కలిసి శనివారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీఐ సంతోష్ మాట్లాడుతూ.. మండలంలోని రైతులు ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత రసీద్ తీసుకోవాలని సూచించారు.

## వరంగల్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు


వరంగల్ తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాచారెడ్డి, మే 31 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు పొంది మొదటిసారిగా వరంగల్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలకడానికి శనివారం మండలం నుంచి భారీ సంఖ్యలో ఎమార్పీఎస్ నాయకులు తరలివెళ్లినట్లు ఎమార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ తెలిపారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు వెంకట్రాములు తదితరులు తరలి వెళ్లారు.

# జిల్లాలో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు


పోచారం చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి రూరల్, మే 31: బక్రీద్ పండుగ సందర్భంగా అనుమతులు లేకుండా అక్రమంగా ఆవులు, పశువులకు రవాణా చేయకుండా జిల్లా మొత్తంలో ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హిందూ, ముస్లిం మత పెద్దలు, యువకులతో శనివారం ఏర్పాటుచేసిన పీస్‌కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజవర్గంలో పోచారం వద్ద చెక్‌పోస్టును ఏర్పాటుచేసిందన్నారు. బక్రీద్ పండుగ ముగిసేవరకు రౌండ్ ది క్లాక్ చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తారన్నారు. అక్రమంగా పశువులను, ఆవులను తరలించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పండుగను ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలన్నారు. సీఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్‌తోపాటు ఏఎస్సై నరేందర్, పోలీసు సిబ్బంది, హిందూ, ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**చెక్‌పోస్టును సందర్శించిన సీఐ**

నాగిరెడ్డిపేట, మే 31 : నాగిరెడ్డిపేట మండలం పోచారం జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును సీఐ రవీందర్‌నాయక్ శనివారం సందర్శించారు. రికార్డులో నమోదు చేసిన వాహనాల వివరాలను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. బక్రీద్ నేపథ్యంలో గోవులను అక్రమంగా తరలించకుండా.. 24 గంటలు గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై మల్లారెడ్డి ఉన్నారు.

**గోవధశాలలను మూసివేయాలి**

ఎల్లారెడ్డి రూరల్, మే 31 : రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను తక్షణమే మూసివేయాలని కళ్యాణి గ్రామస్తులు అన్నారు. ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలో గ్రామానికి చెందిన పలువురు యువకులు పంచాయతీ కార్యదర్శికి శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటుచేయాలన్నారు. గోఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు, గోపోషకులకు తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. బక్రీద్ సందర్భంగా గోరక్షకులు ఆవులను పట్టుకొని పోలీసులకు తెలియజేసేలా వారికి గుర్తింపు పత్రాలను ప్రభుత్వం ఇవ్వాలన్నారు. భాగ్యనగర్, బోరుబండలోని బబ్బిగూడ, నార్సింగి తదితర ప్రాంతాలలో నిర్వహిస్తున్న పశువుల సంతను తక్షణమే ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ యువకులు ఎర్ల శ్రీనివాస్, గుండ అరవింద్ తదితరులున్నారు.

**ఆవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు**

భిక్కనూరు, మే 31 : భిక్కనూరులోని టోల్ ప్లాజా వద్ద అధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో, డీసీఎం వాహనాలను తనిఖీ చేయగా పరిమితికి మించి ఎలాంటి అనుమతులు లేకుండా 12 లేగ దూడలు, 26 ఎడ్లు లను భిక్కనూరు పోలీసులు పట్టుకున్నారు. వీటిని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సత్తాపూర్ గ్రామంలోని ఆవుల సంతలో కొనుగోలు చేసి మెదక్ జిల్లా నార్సింగ్ మార్కెట్‌లో విక్రయించడానికి తరలిస్తుండగా చెక్ పోస్ట్ వద్ద డ్యూటీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్

బీబీపేట్, మే 31 : బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో నాయకులు, అధికారులు కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శనివారం ముగ్గుపోశారు. బీబీపేట మండలంలోని మాందాపూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి పనులను ప్రారంభించారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజు, భాస్కర్, స్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

లింగంపేట్ , మే 31 : మండలంలోని మారుమూల తండాలో శనివారం తెల్లవారుజామున జరుగనున్న బాల్యవివాహాన్ని అడ్డుకున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత తెలిపారు. 18 ఏండ్లు నిండని గిరిజన బాలికకు వివాహం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఐసీడీఎస్ అధికారులు కలిసి అడ్డుకున్నట్లు ఆమె తెలిపారు. స్థానికులు ఇచ్చిన పక్కా సమాచారం మేరకు శుక్రవారం రాత్రి తండాకు చేరుకొని అమ్మాయి మైనర్ అని గుర్తించి వివాహాన్ని నిలిపివేయించారు. బాలిక కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి, బాలికను జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు సూర్యప్రకాశ్, రజిత, మోహన్, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

## జాబ్ మేళాలో విద్యార్థుల ఎంపిక

కామారెడ్డి, మే 31 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో విద్యార్థులు ఎంపికయ్యారు. హెచ్‌సీఎల్ కంపెనీ జాబ్‌మేళాలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక కాగా అందులో ఇద్దరు జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి ఒకేషనల్ కళాశాలకు చెందిన నర్సంపేట పూజిత, దేవోళ్ల విజయ్‌కుమార్ ఎంపికయ్యారు. వారిని శనివారం కళాశాలలో సత్కరించారు. ఎంపికైనవారు మధురై, చెన్నైలో శిక్షణ తర్వాత ఉద్యోగంలో చేరుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సర్దుబాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 31 : ప్రభుత్వం జారీ చేసిన ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ప్రధాన కార్యదర్శి కాంబ్లె గోపాల్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో శనివారం వారు మాట్లాడుతూ.. ఒకవైపు బడిబాట నిర్వహిస్తూ, మరోవైపు విద్యార్థుల సంఖ్యను పెంచాలంటూ, విద్యార్థుల సంఖ్య తెలవకుండానే జూన్ 13వ తేదీన ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అసమంజసంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు పాఠశాలలు బలోపేతం కాకుండా నిర్వీర్యం అయ్యేలా ఉన్నాయన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని ఐదు తరగతుల్లో 11 నుంచి 60 మంది విద్యార్థులు ఉన్న సంఖ్యకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే నిబంధన సరియైనదికాదన్నారు. దీనిని మార్చాలని వారు డిమాండ్ చేశారు. 11 మంది విద్యార్థుల నుంచి 20 మందికి ఇద్దరు ఉపాధ్యాయులు, 21 నుంచి 40 మంది విద్యార్థులకు ముగ్గురు, 41 నుంచి 60 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు, 60 మందికిపైగా విద్యార్థులు ఉంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిబంధనను మార్చాలని వారు కోరారు. గత సంవత్సరం జరిగిన ఉద్యోగోన్నతులు, బదిలీల్లో 'జీరో' ఎన్‌రోల్‌మెంట్ ఉన్న ఉన్నత పాఠశాలలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులను భర్తీ చేశారని, ఇది ఎంతో విడ్డూరమన్నారు. బడిబాట పూర్తయిన తర్వాత విద్యార్థులు ఉండి ఖాళీలు ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి జూలై 1వ తేదీన సర్దుబాటు చేయాలని వారు కోరారు.

## పెండింగ్ చలాన్లు వెంటనే చెల్లించాలి

ఎల్లారెడ్డి రూరల్, మే 31 : వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ సూచించారు. ఎల్లారెడ్డి శివారులో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ ముగిసేవరకు పశువులను అక్రమంగా ఆటోలు, లారీల్లో తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని, లేకపోతే వాహనాన్ని సీజ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. పెండింగ్ చలాన్లను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఆయనతోపాటు కానిస్టేబుళ్లు సిద్దూ, అమర్, హోంగార్డ్ పెంటయ్య తదితరులున్నారు.

## భూభారతితో సమస్యలు పరిష్కారం

లింగంపేట్ , మే 31: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్‌తో రైతుల భూసమస్యలకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ సురేశ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి ప్రోగ్రాం లింగంపేట్ మండలంలో విజయవంతమైందన్నారు. భూభారతి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం లింగంపేట్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, ఏప్రిల్ 14వ తేదీన భూభారతి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. లింగంపేట్ మండలంలో ఏప్రిల్ 17వ తేదీ నుంచి గ్రామాలవారీగా సభలను నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు కొత్త పాస్ బుక్‌లను అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 4వేల 225 మంది రైతుల నుంచి దరఖాస్తులు రాగా, వెయ్యిమంది రైతుల సమస్యలను పరిష్కరించామన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

FINANCE
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## గుంతలు తవ్వారు.. పూడ్చడం మరిచారు

- గుంతలో పడి ఆవు మృతి
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


గుంతలో పడిన మృతిచెందిన ఆవును జేసీబీ సహాయంతో బయటికి తీస్తున్న స్థానికులు

బిచ్కుంద, మే 31 : పట్టణంలో ఆర్టీసీకి సంబంధించిన బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అధికారులు గుంతలు తవ్వి పూడ్చడం మరిచారు. దీంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. ఆటో యూనియన్ కార్యాలయం వైపు తవ్విన గుంతలో శనివారం ఓ నోరులేని మూగ జీవి పడి ప్రాణాలు కోల్పోయింది. వారం రోజుల క్రితం బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరితాదేవి బిచ్కుంద పట్టణంలోని బస్టాండ్‌ను సందర్శించారు. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రెండు వైపుల జేసీబీ సహాయంతో గుంతలు తవ్వి వదిలేశారు. దీంతో ప్రజలకు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలు పడి గుంతలో నీరు చేరడంతో రాత్రి సమయంలో బస్టాండుకు వచ్చే ప్రయాణికులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే మూగ జీవి ప్రాణాలు కోల్పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించి ఇబ్బందులు తొలగించాలని ప్రజల కోరుతున్నారు.

## ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా కిరణ్మయి

ఎల్లారెడ్డి రూరల్, మే 31 : ఎల్లారెడ్డి ఆర్డీవోగా సబ్‌కలెక్టర్ కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు. ఆగస్టు 2023లో ఎల్లారెడ్డి ఆర్డీవోగా వచ్చిన మన్నె ప్రభాకర్ 21 నెలలపాటు విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు అప్పగించారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానన్నారు.

## హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరికి రిమాండ్

బిచ్కుంద, మే 31 : భూమి తగాదా కారణంగా ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ శనివారం అరెస్టు చేసి సీఐ నరేశ్ ఎదుట హాజరు పరిచారు. రెండు గొడ్డళ్లు, టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ జగడం నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం జుక్కల్ మండలంలోని హంగర్గా గ్రామానికి చెందిన జాదవ్ రావుసాబ్, జాదవ్ పండిత్ రావు కుటుంబాల మధ్య భూమి విషయంలో తగాదా జరిగింది. రావుసాబ్ భార్య లక్ష్మీబాయిపై పండిత్ రావు కొడుకు బాలాజీ కమ్మకత్తి, గొడ్డలితో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు శుభం అడ్డుపడగా పండిత్ రావు అతనిపై గొడ్డలితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. జుక్కల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా పరారీలో ఉన్న నిందితులను శనివారం పట్టుకొని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.